

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతీ యువకులకు జర్నలిస్టుగా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తా సేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 28, జూన్ 2026 | సంపుటి :16 సంచిక :86 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00

## రెండేళ్లలో 500 నగరాలకు
# ‘భారత్ ట్యాక్సీ’ సేవలు: అమిత్ షా



ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

హోం మంత్రి అమిత్ షా గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. ‘వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది’ అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.



## సీషెల్స్ పర్యటనలో గ్లోబల్ సౌత్
# ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్తాం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు (శనివారం) నుంచి మూడు రోజుల పాటు సీషెల్స్ దేశంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’లో పోస్టు పెట్టారు. సీషెల్స్ జాతీయ దినోత్సవంలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

వార్త 2లో

## పశ్చిమాసియాలో భారత్ ప్రభావం
# తగ్గిపోయింది: సోనియా

2



పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు.. పాలస్తీనా, గాజా సంక్షోభంపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక ఇంగ్లీష్ దిన పత్రికకు రాసిన వ్యాసంలో ఆమె కేంద్ర ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు గుప్పించారు. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రధాని మోదీ వహిస్తున్న ‘రాతి మౌనం’ దేశ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆమె ఆరోపించారు.

2



## ఎబోలా భయంతో కేంద్రం చర్యలు.. ప్రయాణికులకు హెల్త్ డిక్లరేషన్ తప్పనిసరి

అంతర్జాతీయ ప్రయాణికులకు భారత ప్రభుత్వం కీలక అలర్ట్ జారీ చేసింది. ఎయిర్ సువిధ 2.0 పోర్టల్‌ను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రారంభించారు.

## గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా
# యంత్రాంగం సన్నద్ధం కావాలి

గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (వీఅఅఅర్వతీ ఎష్ట్రబఎఝశ్రీఖ ఛీఖస్త్రవంఖుతీఖ ఉశీ) ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై ఈరోజు(శనివారం) జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

2




## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన
# ప్రతి హామీని అమలు చేస్తాం: మంత్రి పొన్నం

2




## సమగ్ర ఓటరు జాబితా
# సవరణను ఎవరూ అడ్డుకోలేరు: కిషన్ రెడ్డి

హైదరాబాద్:



ప్రజల్లో చైతన్యం వచ్చిందని సర్ ప్రక్రియలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సర్ ప్రక్రియను ఇసి పార్టీలకు అతీతంగా నిర్వహిస్తోందని, సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొందరికి నాలుగైదు ఓట్లు ఉన్నాయని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శిం చారని, డూప్లికేట్ ఓట్లు, దొంగఓట్లను తొలగించేందుకే ఇసి సర్ ప్రక్రియను చేపట్టిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ లో ఎంతోమంది రోహింగ్యాలు అక్రమంగా ఉన్నారని, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి ఓట్లు, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని తెలియజేశారు. హైదరాబాద్ లో ఉంటున్న చాలామందికి రెండు ఓట్లు ఉన్నాయని, సమగ్ర ఓటరు జాబితా సవరణను ఎవరూ అడ్డుకోలేరని హెచ్చరించారు. ఇసి అధికారులకు తోడుగా వెళ్లే బిఎల్ వోలు, బిఎల్ఎలు స్థానికులేనని, బెదిరించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## రేవంత్ .. కర్ణాటక ప్రాజెక్టులకు అభ్యంతరం ఎందుకు చెప్పలేదు

2





2

## సుప్రీం కోర్టు తీర్పు.. దశాబ్దాల నాటి ఆస్తి తగాదాకు ఫుల్ స్టాప్

నాలుగు తరాలుగా కొనసాగుతున్న ఒక భూవివాదానికి సుప్రీం కోర్టు తాజాగా ఫుల్ స్టాప్ పెట్టింది.

# సీషెల్స్ పర్యటనలో గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్తాం: ప్రధాని మోదీ

ఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు (శనివారం) నుంచి మూడు రోజుల పాటు సీషెల్స్ దేశంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. సీషెల్స్ జాతీయ దినోత్సవంలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది స్వర్ణోత్సవ వేడుకలు జరగడంతో ఈ పర్యటన మరింత ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు.సీషెల్స్ భారతదేశానికి అత్యంత విలువైన సముద్ర సరిహద్దు పొరుగు దేశమని, భారతదేశం చేపట్టిన 'మహాసాగర్ విజన్'లోనూ, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలోనూ కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినితో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, సముద్ర భద్రతా సహకార అంశాలపై వీరు చర్చించే అవకాశం ఉంది.అలాగే సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించడం గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. సీషెల్స్‌లో నివసిస్తున్న భారతీయ సమాజ ప్రతినిధులను కలుసుకునేందుకు కూడా తాను ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.ఈ పర్యటన భారత్--సీషెల్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు దోహదపడనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# పశ్చిమాసియాలో భారత్ ప్రభావం తగ్గిపోయింది: సోనియా

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు.. పాలస్తీనా, గాజా సంక్షోభంపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక ఇంగ్లీష్ దినపత్రికకు రాసిన వ్యాసంలో ఆమె కేంద్ర ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రధాని మోదీ వహిస్తున్న 'రాతి మౌనం' దేశ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆమె ఆరోపించారు.ఇన్నాళ్లూ పశ్చిమాసియా ప్రాంతంలో, గ్లోబల్ సౌత్ దేశాల్లో భారతదేశానికి ఉన్న సంప్రదాయ, చరిత్రాత్మక వ్యూహాత్మక ప్రాభవాన్ని ప్రస్తుత మోదీ ప్రభుత్వం పూర్తిగా బలహీనపరిచిందని సోనియా గాంధీ విమర్శించారు. గాజాలో ఇజ్రాయెల్ దాడుల వల్ల వేలాది మంది అమాయక పిల్లలు, పౌరులు ప్రాణాలు కోల్పోతున్నా, వెస్ట్ బ్యాంక్‌లో లక్షలాది పాలస్తీనా కుటుంబాలు బలైపోతున్నా భారతదేశం నిశ్శబ్ద ప్రేక్షక పాత్రకే పరిమితమైందన్నారు.'పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు భారత్ ఒక కీలక దౌత్య పాత్ర పోషించే అద్భుతమైన అవకాశం ఉన్నప్పటికీ, మోదీ ప్రభుత్వం దానిని చేజేతులా వదిలేసింది. ఈ వ్యూహాత్మక మౌనాన్ని అటు నైతికంగా గానీ, ఇటు దేశ ప్రయోజనాల పరంగా గానీ సమర్థించలేం'. అని సోనియా గాంధీ అన్నారు.

**పాకిస్తాన్ చేతికి చిక్కిన అవకాశం!**

భారత్ వహించిన మౌనాన్ని ఆసరాగా చేసుకుని, మన పొరుగు దేశమైన పాకిస్తాన్ పశ్చిమాసియా శాంతి చర్చల్లో చొరవ తీసుకుని తన ప్రభావాన్ని అంతర్జాతీయంగా పెంచుకుందని సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఆ ప్రాంతంలో తన పాత మిత్రదేశాలైన పాలస్తీనా, ఇరాన్ వంటి దేశాలకు క్రమంగా దూరమవుతూ, ఇజ్రాయెల్ వ్యూహాత్మక వలలోకి పూర్తిగా జారిపోతోందని ఆమె విమర్శించారు.

**సోనియా గాంధీ వ్యాసానికి ఖర్గే, రాహుల్ మద్దతు**

సోనియా గాంధీ వ్యక్తపరిచిన ఈ ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు గట్టి మద్దతు పలికారు. సోనియా రాసిన భావోద్వేగభరితమైన వ్యాసం మోదీ ప్రభుత్వ ఉదాసీనతను ఎత్తిచూపిందని, ప్రపంచ ప్రజాభిప్రాయానికి భిన్నంగా భారత్ ఒంటరిగా మారుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'ఌ' (ట్విట్టర్) లో పేర్కొన్నారు.

# ఎబోలా భయంతో కేంద్రం చర్యలు.. ప్రయాణికులకు హెల్త్ డిక్లరేషన్ తప్పనిసరి

ఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

అంతర్జాతీయ ప్రయాణికులకు భారత ప్రభుత్వం కీలక అలర్ట్ జారీ చేసింది. ఎయిర్ సువిధ 2.0 పోర్టల్‌ను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇకపై అంతర్జాతీయ ప్రయాణికులందరికీ 'హెల్త్ సెల్ఫ్-డిక్లరేషన్' ఫారమ్ తప్పనిసరని అధికారులు స్పష్టం చేశారు. భారతదేశానికి వచ్చే ప్రయాణికులు విమానం ఎక్కడానికి 24 గంటల ముందే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.గత 21 రోజుల ప్రయాణ చరిత్ర, ఆరోగ్య లక్షణాలను పోర్టల్‌లో ఖచ్చితంగా పొందుపరచాల్సిందేనని అధికారులు తెలిపారు. ఎబోలా, బుండిబుగ్యో వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య, విమానయాన శాఖలు అప్రమత్తమయ్యాయని చెప్పుకొచ్చారు. విదేశాల నుంచి వచ్చే వారు ఈ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్



వేగంగా పూర్తి కావడానికి ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరని అధికారులు తేల్చిచెప్పారు. ప్రయాణికులకు బోర్డింగ్ సమయంలో, విమానంలోనూ ముందస్తు అలర్ట్ జారీ చేయాలని ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించారు. డౌన్‌లోడ్ చేసిన హెల్త్ డిక్లరేషన్ ఫారమ్‌ను ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద చూపించడం తప్పనిసరని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# తెలంగాణ రైజింగ్ విజన్‌కు ప్రపంచ దిగ్గజ కంపెనీల మద్దతు

**రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి**

**శిక్షణ పొందిన యువతకు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు**

**పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ**

**ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి**

**రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి




తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో




తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి: మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం, న్యూస్‌వార్ ప్రతినిధి

గోదావరి వరదల వల్ల ప్రాణనష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (విఅఅఖవతీ ష్ట్రబఎఎఱఞ్ఱ ష్ట్రషఞ్రపఖుఞఱఞ్ఱ ఞుఞ్ఱ) ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గోదావరి వరదల నేపథ్యంలో




ముందస్తు ప్రణాళికపై ఈరోజు(శనివారం) జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**అధికారులు సమన్వయం చేసుకోవాలి..**

జిల్లా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణేశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే లోతట్టు గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ప్లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం: మంత్రి పొన్నం

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈరోజు(శనివారం) ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం ఫిట్‌మెంట్ జూలై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు.గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన ప్రక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. జేఏసీతో సమావేశం నిర్వహించాక వారి ఆమోదంతో విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# సుప్రీం కోర్టు తీర్పు.. దశాబ్దాల నాటి ఆస్తి తగాదాకు ఫుల్ స్టాప్

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

నాలుగు తరాలుగా కొనసాగుతున్న ఒక భూవివాదానికి సుప్రీం కోర్టు తాజాగా ఫుల్ స్టాప్ పెట్టింది. భూమికి సంబంధించిన 1957 నాటి సేల్ డీడ్ చట్టబద్ధమేనంటూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి అంజరియాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించడంతో వివాదానికి ఫుల్ స్టాప్ పడింది.

**ఏమిటీ వివాదం..**

ఈ కేసులో అప్పీలు చేసుకున్న సరాఫత్ అలీ పూర్వీకులు 1957లో హరిద్వార్ (ఉత్తరాఖండ్) కొంత భూమిని కొనుగోలు చేశారు. అప్పటికి సరాఫత్ అలీ మైనర్. నాటి నుంచీ ఆ భూమి సరాఫత్ అలీ కుటుంబం ఆధీనంలోనే ఉంది. భూమిని సరాఫత్ పూర్వీకులకు అమ్మిన కొందరు అభ్యంతరం చెప్పడంతో సేల్ డీడ్ జరిగినా మ్యూటేషన్ మాత్రం నిలిచిపోయింది. 1984లో వారు తమ అభ్యంతరాలను వెనక్కు తీసుకోవడంతో మ్యూటేషన్ కూడా పూర్తయ్యింది. అయితే, 1991లో ప్రభుత్వం భూమి ఏకీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో తనను భూమిదారుగా గుర్తించాలని సరాఫత్ దరఖాస్తు చేసుకున్నారు.1993లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ హక్కులను గుర్తించారు. అయితే, సరాఫత్ భూమిపై కో టెనెన్సీ హక్కులున్న మరికొందరు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో 1999లో కాన్సలిడేషన్ అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించారు. యూపీ జమీందారీ భూముల రద్దు చట్టం ప్రకారం 1957 నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. అంతేకాకుండా నాటి సేల్ డీడ్‌పై సంతకం చేసిన సాక్షి వివరాల్లో స్పష్టత లేకపోవడంతో సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. చివరకు హైకోర్టులో కూడా సరాఫత్ కుటుంబానికి చుక్కెదురైంది.ఈ కేసులో సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. సాక్షి వివరాల్లోని స్వల్ప లోపాల ఆధారంగా సేల్ డీడ్ చెల్లదని చెప్పలేమని పేర్కొంది. సేల్ డీడ్ ఫోర్జరీ జరిగిందనే ఫిర్యాదు కూడా లేకపోవడాన్ని ఈ సందర్భంగా కోర్టు పేర్కొంది. జమీందారీ చట్టానికి 1981లో చేసిన సవరణలు 1957కు వర్తించవని కూడా పేర్కొంది. నాటి సేల్ డీడ్ చెల్లుతుందంటూ తీర్పు వెలువరించింది.

# రేవంత్ .. కర్ణాటక ప్రాజెక్టులకు అభ్యంతరం ఎందుకు చెప్పలేదు: హరీష్ రావు

హైదరాబాద్:

రాష్ట్ర జలహక్కులపై సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. ట్రిబ్యునల్, అపెక్స్ లేకుండానే దొడ్డి దారిన ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణభవన్ లో మీడియాతో మాట్లాడుతూ..మన జలహక్కులకు ప్రమాదమని తెలిసినా రేవంత్ వత్తాసు పలుకుతున్నారని, ఏపీ, కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల కోసం తెలంగాణ జలహక్కుల తాకట్టు సర్కార్ కుట్రని విమర్శించారు. తుంగభద్ర డ్యామ్ నూతన గేట్ల ప్రారంభోత్సవంలో రేవంత్ రహస్య ఒప్పందం అని జలహక్కుల పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. జల హక్కులను కాపాడేందుకు బిఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుందని, మాజీ సీఎం హెచ్చరికలతో నాడు గుండ్రేవులకు బ్రేకులు పడ్డాయని, ముగ్గురు సిఎంలు కలిసి ఒప్పందం చేసుకున్నామని అంటున్నారని తెలిపారు. ముగ్గురు సిఎంల రహస్య ఒప్పందాలను బయట పెట్టాలని, గుండ్రేవుల రిజర్వాయర్ పూర్తయితే తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ధ్వజమెత్తారు. కర్ణాటక ప్రాజెక్టులకు రేవంత్ అభ్యంతరం ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రేవంత్ అవగాహన రాహిత్యంతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టమని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి కర్ణాటక లేఖ రాసిందని, ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 30 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క ప్రాజెక్టుకైనా అనుమతిచ్చారా? అని ప్రశ్నించారు. ప్రతిసారి డిపిఆర్ ఎందుకు వాపస్ వస్తుందని, తమ గురువు కోసం ఏం చెప్పకున్నారో ప్రజలకు తెలియాలని, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఏం చెబితే కేంద్రంలో అదే జరుగుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు పలుకుబడితో ఏపీ వ్యక్తిని కేంద్ర ఇరిగేషన్ అధికారిగా నియమించారని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హరీష్ రావు హెచ్చరించారు.


న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# జుట్టుకు కాలుష్యం ఎసరు

చాలా ఏళ్లనుంచి దేశ రాజధాని ఢిల్లీ వాయు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అక్కడున్న ప్రజలు.. వాయు కాలుష్యం బారినపడి ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. వివిఐపిలు ఢిల్లీ వదిలి శివారు ప్రాంతాలకు మకాం మార్చేస్తున్నారు. అదే బాటలో ముంబై, చండీగఢ్ నడుస్తున్నాయి. అయితే వీటి బాటలోనే సౌత్‌లో కీలక కేపిటల్ హైదరాబాద్ తయారైంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కాలుష్యం ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ నిర్దేశిత ప్రమాణాలను దాటేసింది. దేశ రాజధాని ఢిల్లీ, ముంబై వంటి నగరాలతో పోలిస్తే గాలి నాణ్యత మెరుగ్గా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లోనే పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని కాలుష్య నియంత్రణ మండలి అభిప్రాయపడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం గాలిలో సూక్ష్మధూళికణాలు 40 మైక్రోగ్రాములు ఉండాలి. కానీ, హైదరాబాద్‌లో ఇది 82నుంచి 88 ఎంజిల వరకు ఉంటోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పరిమితి 60 ఎంజితో పోల్చినా, హైదరాబాద్‌లో 35% అధిక కాలుష్యం ఉన్నట్లు స్పష్టమైంది.

గత ఏడాది పొడవునా నగరంలో ఒక్క రోజు కూడా 'స్వచ్ఛమైన గాలి' ఉన్నట్లు రికార్డు కాలేదు. గాలి నాణ్యత సూచీ కేవలం 'మధ్యస్థం' లేదా 'సంతృప్తికరం' స్థాయిలకే పరిమితమైందని సర్వేలో తేలింది. 2026 జనవరిలో పిఎం-10 స్థాయి గరిష్ఠంగా 105 ఎంజి వరకు వెళ్లడం నగర గాలిలో పెరుగుతున్న విషతుల్యతకు నిదర్శనంగా చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలో వాహనాల రద్దీ పెరగడంతో ఏడు ప్రధాన ప్రాంతాలను 'కాలుష్య హాట్‌స్పాట్లు' గా అధికారులు గుర్తించారు. అవి ఖైరతాబాద్ కోఠి, జీడిమెట్ల, బిహెచ్ఇఎల్ -అమీర్‌పేట, నాంపల్లి- చార్మినార్, మెహిదీపట్నం -హైటెక్‌సిటీ -కూకట్‌పల్లి, సికింద్రాబాద్- సైనిక్‌పురి, ఎల్‌బీనగర్- కోఠి. ఈ ప్రాంతాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు అవసరం అంటున్నారు అధికారులు. వాయు కాలుష్యం పెరగడానికి కేవలం వాహనాలే కాకుండా, నగర శివార్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, పరిశ్రమల ఉద్గారాలు కూడా ప్రధాన కారణమవుతున్నాయి. పిఎం-10 స్థాయి పెరగడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచకపోతే గాలి నాణ్యత మరింత పడిపోయే ప్రమాదం ఉంది. ఈ కాలుష్యం శ్వాసకోశ సమస్యలతో పాటు విటమిన్ డి లోపానికి కారణమవుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈమధ్యకాలంలో యువతని ఎక్కువగా వేధిస్తున్న సమస్య ఊబకాయం.. బట్టతల. చిన్నవయసులోనే విపరీతంగా జుట్టు ఊడిపోతోంది. గ్లోబల్ సిటీగా మారిన హైదరాబాద్‌లో వాహనాల పొగ, దుమ్ము, పారిశ్రామిక వ్యర్థాలవల్ల గాలి నాణ్యత దెబ్బతింటోంది. ఇది నేరుగా నగరవాసుల జుట్టు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. హైదరాబాద్ అంటే బిరియానీ, ఐటి ఉద్యోగాలు మాత్రమే కాదు.. నగర యువతను నేడు వేధిస్తున్న అతిపెద్ద అంతర్గత సమస్య ముందస్తు బట్టతల. నిన్న మొన్నటి వరకు వంశపారంపర్యంగా లేదా ఒత్తిడి వల్ల మాత్రమే జుట్టు రాలుతుందని అనుకునేవారు. కానీ, ఇటీవల అంతర్జాతీయ పరిశోధనలు, చర్మనిపుణుల పరిశీలనలో అనేక విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. డెర్మటాలజిస్టుల పరిశీలనలో వాయు కాలుష్యం జుట్టు రాలడానికి, బట్టతలకు ఒక సైలెంట్ కిల్లర్‌గా మారినట్లు స్పష్టమైంది. గాలిలోని విష కణాలు జుట్టును ఎలా దెబ్బతీస్తాయి? మనం పీల్చే గాలిలో ఉండే సూక్ష్మధూళి కణాలు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, , వాహనాల నుంచి వచ్చే కార్బన్ మోనాక్సైడ్ వంటి విషవాయువులు తల చర్మంపై స్థిరపడతాయి. కాలుష్య కణాలు తలలోని సహజ నూనెల్ని చెమటతో కలిసి కుదుళ్ల రంధ్రాలను పూర్తిగా మూసివేస్తాయి. దీనివల్ల కొత్త జుట్టు పెరగడం ఆగిపోతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ కారణంగా ఈ సమస్య ఎక్కువ అవుతుంది. ఫలితంగా జుట్టు బలహీనపడి రాలిపోతుంది. రోజూ ట్రాఫిక్‌లో ప్రయాణించే వారికి తలలో దురద, మంట, పొట్టు రాలడం, కుదుళ్లలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ఐటి కారిడార్లలో నిరంతరం జరిగే నిర్మాణ పనులు, భారీ ట్రాఫిక్ జామ్‌ల కారణంగా వాహనాల నుంచి వెలువడే పొగ ఎక్కువగా ఉంటుంది. వీటికి తోడు హైదరాబాద్‌లోని హార్డ్ వాటర్ తోడవ్వడంతో జుట్టు మరింత పొడిబారి, త్వరగా బట్టతల రావడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. బట్టతల సమస్యను కొందరు కేటుగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్, పాతబస్తీ వంటి ప్రాంతాలకు వెళితే మనకు కొన్ని ప్రకటనలు కనిపిస్తాయి. మీరు బట్టతలతో బాధపడుతున్నారా. రెండు రోజుల్లో బట్టతలపై జుట్టు మొలిపిస్తాం అంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చి భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ఢిల్లీకి చెందిన కొన్ని నకిలీ ముఠాలు రోడ్‌సైడ్ క్యాంపులు పెట్టి, హానికరమైన కెమికల్ లోషన్లు రాసి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. వీటివల్ల జుట్టు రావడం దేవుడి ఎరుగు.. తల చర్మం కాలిపోయి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇటీవల ఈ నకిలీ వైద్యులపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. కాలుష్యం నుండి జుట్టును కాపాడుకునే మార్గాలను అన్వేషించాలి. బైక్‌లపై ప్రయాణించేటప్పుడు లేదా ట్రాఫిక్‌లోకి వెళ్లేటప్పుడు కాటన్ హెల్మెట్ క్యాప్ లేదా స్కార్ఫ్‌తో తలను పూర్తిగా కవర్ చేసుకోవాలి. తల స్నానం చేసి కాలుష్య కణాలను తొలగించాలి. విటమిన్ సి, ఇ, గ్రీన్ టీ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉన్న సిరమ్‌లు లేదా ఆహారం తీసుకోవడం వల్ల కాలుష్య ప్రభావం తగ్గుతుంది. జుట్టు విపరీతంగా రాలుతుంటే నకిలీ ప్రకటనలు నమ్మకుండా, అర్హత కలిగిన డెర్మటాలజిస్ట్ లను కలిసి పిఆర్‌పి థెరపీ లేదా మినాక్సిడిల్ వంటి వైద్య చికిత్సలు పొందడం సురక్షితం అని సూచిస్తున్నారు. బట్టతల పూర్తిగా ఏర్పడిన వారికి ఎఫ్‌యుఇ లేదా ఎఫ్‌యుటి పద్ధతుల ద్వారా శాశ్వత జుట్టు మార్పిడి చికిత్స చేయించుకోవచ్చు. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, పోషకాహార లోపం జుట్టు రాలడానికి దారితీస్తాయి. స్నానం చేసే నీటికోసం వాటర్ సాఫ్ట్‌నర్లు లేదా షవర్ ఫిల్టర్లు ఉపయోగించడం ద్వారా కఠినమైన లవణాలను నివారించవచ్చు. రసాయనాలు లేని, సున్నితమైన షాంపూలను ఎంచుకోవాలి.



# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది

1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం

వికారాబాద్ జిల్లా చేవెళ్ల రిత్వరలో ఏర్పాటు

సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,**

సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు



ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు. ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫ్యాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

# పాస్‌పోర్ట్, ఆధార్‌ను ధ్రువీకరణ పత్రాలుగా గుర్తించాలి

కేంద్ర విదేశాంగశాఖ ప్రకటన సరైంది కాదు

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ**

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. కేంద్రం చెబుతున్న విధానం చట్టపరంగా ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని, ఆధార్ కూడా పౌరసత్వాన్ని నిర్ధరించదని చెబితే, సాధారణ భారతీయుడు తన పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఆ అంశంపై ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు చట్టాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. ఆ ప్రకటన అనంతరం సామాజిక మాధ్యమాలు, రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. దీనిపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన శశి థరూర్, కేంద్రం వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాసానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ఆధారం కాదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం కోట్లాది మంది భారతీయులు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. చట్టాల్లో మార్పులు చేసి, ప్రభుత్వం రద్దు చేయనంత వరకు చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్ లేదా సాధారణ ఆధార్ కార్డును భారత పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే, భారతీయులు, నివాసితులకు ప్రత్యేక రంగు లేదా ప్రత్యేక గుర్తింపుతో ఉండే ఆధార్? కార్డులను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధంగా భారతీయ పౌరులు, పౌరులు కాని వారిని స్పష్టంగా వేరు చేయవచ్చని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఆధార్ కార్డు లేదా చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం గుర్తించవచ్చని చెప్పారు. దీంతో ఎన్నికల జాబితాల సవరణలు వంటి ప్రక్రియల్లో అనవసర వివాదాలు తగ్గుతాయని, పరిపాలనా ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. "ఈ రెండు పత్రాల్లో ఏదో ఒకటి ఉంటే భారత పౌరుడిగా గుర్తించే విధానాన్ని అమలు చేస్తే, పౌరసత్వంపై అనవసర చర్చలకు ముగింపు పడుతుంది. ప్రజలకు కూడా తమ గుర్తింపు విషయంలో పూర్తి చట్టపరమైన స్పష్టత లభిస్తుంది" అని శశి థరూర్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం నిర్వహించిన సమావేశంలో భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని వెల్లడించింది. అనంతరం గురువారం కూడా ఆ అంశంపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇటీవల లేదా గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని తెలిపింది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను కేంద్రం ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించింది.

# పాఠశాలలు, పిల్లలపై దాడులు ఉపేక్షించం

దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దు

ఐరాసలో గళమెత్తిన భారత ప్రతినిధులు

**న్యూఢిల్లీ,**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రాంతాల్లో నలిగిపోతున్న పిల్లలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరిహద్దుల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణల సమయంలో పాఠశాలలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దని, చట్టం ముందు నిలబెట్టాలని భారత్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్ ఈ మేరకు స్పష్టం చేసింది. కేవలం పిల్లలకు రక్షణ కల్పించడం మాత్రమే సరిపోదని, వారిపై అఘాయిత్యాలకు ఒడిగట్టే వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించినప్పుడే ఆ రక్షణకు పూర్తి అర్థం చేకూరుతుందని నొక్కి చెప్పింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ భద్రతా మండలిలో జరిగిన "సంఘర్షణల ప్రభావితమైన పిల్లల విద్యా సంరక్షణ - నిబంధనల అమలు" అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొని ఆయన మాట్లాడారు. యుద్ధాలు, అంతర్గత కలహాల వల్ల తీవ్రంగా నష్టపోయేది భవిష్యత్తు తరమైన పిల్లలేనని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. భీకర ఘర్షణల సమయంలో కూడా విద్య అనేది పిల్లల ప్రాథమిక హక్కుగా కొనసాగాలని, దీన్ని ఏ శక్తీ హరించలేదని పర్వతనేని హరీశ్ స్పష్టం చేశారు. సమాజంలో శాశ్వత శాంతిని స్థాపించడంలో విద్య అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని, సాయుధ పోరాటాల్లో పిల్లల ప్రాణాలను కాపాడటానికి, వారి విద్యా హక్కును రక్షించడానికి భారతదేశం ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పాఠశాలలపై బాంబుల వర్షం కురిపిస్తూ, బాల్యాన్ని చిదిమేస్తున్న శక్తుల పట్ల అంతర్జాతీయ సమాజం కఠినంగా వ్యవహరించకపోతే మానవాళికే ముప్పని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హక్కుల ఉల్లంఘనలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన స్థాయికి చేరుకున్నాయని భారత్ గుర్తుచేసింది. ఈ మేరకు ఇటీవల ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ సమర్పించిన నివేదికలోని గణాంకాలను ప్రస్తావించింది. ఈ నివేదికలోని గణాంకాలు అంతర్జాతీయ సమాజపు సామూహిక వైఫల్యానికి అద్దం పడుతున్నాయని విచారం వ్యక్తం చేసింది. కేవలం ఒక సంవత్సర కాలంలోనే పిల్లలపై ఏకంగా 38,558 తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని ఐరాస నివేదిక చెబుతోంది. వీటివల్ల ప్రపంచవ్యాప్తంగా 24,174 మంది పిల్లలు ప్రత్యక్షంగా నష్టపోయారు. ఇందులో 15,493 మంది బాలురు, 7,990 మంది బాలికలు ఉండగా, మిగిలిన వారి వివరాలు లభ్యం కాలేదు. ఐక్యరాజ్యసమితి ఈ రికార్డులను సేకరించడం ప్రారంభించిన తర్వాత, ఇంత భారీ సంఖ్యలో పిల్లలు హింసకు గురికావడం ఇదే మొదటిసారి. యుద్ధాలు, అంతర్గత కలహాలు జరిగే ప్రాంతాల్లో పిల్లలపై ఒకటి కంటే ఎక్కువసార్లు జరుగుతున్న దాడుల సంఖ్య కూడా ఏటా పెరిగిపోతోందని నివేదిక చెబుతోంది. యుద్ధ నిబంధనలను, అంతర్జాతీయ మానవతా చట్టాలను ఆయా పక్షాలు తుంగలో తొక్కుతున్నాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అన్నింటికంటే దారుణమైన విషయం ఏమిటంటే, కేవలం ఒక్క ఏడాదిలోనే పాఠశాలలు, విద్యాసంస్థలపై జరిగిన దాడుల సంఖ్య 44 శాతం పెరిగాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 47.3 కోట్ల మంది పిల్లలు అంటే ప్రపంచంలోని ప్రతి ఆరుగురిలో ఒకరు యుద్ధ వాతావరణంలో బతుకుతున్నారు లేదా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలసపోతున్నారని ఐరాస నివేదిక చెప్పింది. వీరిలో 8.5 కోట్ల మందికి పైగా పిల్లలకు అసలు చదువుకునే భాగ్యమే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది పిల్లల భవిష్యత్తును మాత్రమే కాదని, ఆయా దేశాల భవితవ్యాన్ని కూడా నాశనం చేస్తోందని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. దురదృష్టవశాత్తూ కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ బలగాలే బాధ్యతారహితంగా ఆసుపత్రులు, పాఠశాలలపై దాడులకు కారణమవుతున్నాయని ఐరాస నివేదిక స్పష్టం చేసింది.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# నిధుల కేటాయింపులో వివక్షత చూపుతున్న స్థానిక ఎమ్మెల్యే

## మునుగోడు నియోజకవర్గ బీజేపీ సర్పంచుల ఆవేదన

## న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతిపత్రం



మునుగోడు జూన్ 27 (న్యూస్ వార్)

మునుగోడు నియోజకవర్గ బిఎల్ఎ -2 ల అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే శ్రీ పైడి రాకేష్ రెడ్డికి మునుగోడు నియోజకవర్గ బీజేపీ సర్పంచులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి కోసం విడుదల చేస్తున్న ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను స్థానిక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పక్షపాత ధోరణితో కేవలం కాంగ్రెస్ పార్టీ సర్పంచులుగా గెలిచిన గ్రామాలకు మాత్రమే మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత రెండు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధి హామీ పథకం నిధులను అన్ని గ్రామాలకు సమానంగా కేటాయించకుండా, రాజకీయ ప్రాతిపదికన పంపిణీ చేయడం వల్ల బీజేపీ మరియు ఇతర పార్టీల సర్పంచులు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామాల అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని తెలిపారు. ఈ పక్షపాత వైఖరి కారణంగా ఆయా గ్రామాల ప్రజలు అభివృద్ధి ఫలాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో కేంద్ర నిధులను విడుదల చేస్తుంటే, స్థానిక స్థాయిలో రాజకీయ వివక్ష చూపడం ద్వారా మునుగోడు నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతోందని సర్పంచులు రాకేష్ రెడ్డికి వివరించారు. ఈ అంశాన్ని రాష్ట్ర మరియు కేంద్ర స్థాయిలలో ప్రస్తావించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజులా రెడ్డి, సుర్వి సౌజన్య రాజు గౌడ్, కైరం కొండ స్వప్నఅశోక్, ముదిగొండ ఆంజనేయులు, ఉప్పల రమేష్ గౌడ్, తంగెళ్ల వెంకటేష్, నందగిరి వెంకటేష్ గౌడ్, బోయ మహేందర్ మణికుమార్, మంటిపల్లి మణిమాలశ్రీశైలం తదితర సర్పంచులు పాల్గొన్నారు

# దివ్యాంగ చిన్నారుల కోసం ఉచిత ఈ-ఆటో సేవలు: ప్రారంభించిన మంత్రి సీతక్క



దివ్యాంగ చిన్నారుల జీవితాల్లో ఆత్మవిశ్వాసం, ఆశాభావాన్ని నింపేలా ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బుద్ధిమాంద్యం, ఆటిజం, ఇతర అభివృద్ధి లోపాలు ఉన్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఉచిత రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ-ఆటోలను రాష్ట్ర మంత్రి సీతక్క, సీఈఓ దివ్య దేవరాజన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఆటోలు కేవలం వాహనాలు మాత్రమే కావని, దివ్యాంగులు, వారి కుటుంబాలకు ఆత్మగౌరవాన్ని, మెరుగైన అవకాశాలను తీసుకొచ్చే ఆశాకిరణాలని మంత్రి ఈ సందర్భంగా అభివర్ణించారు.ఈ సేవలను ప్రారంభించిన అనంతరం మంత్రి సీతక్క, సీఈఓ దివ్య దేవరాజన్ నైబర్‌హుడ్ కేంద్రాలకు చెందిన ఇద్దరు దివ్యాంగ చిన్నారులతో కలిసి ఈ-ఆటోలో ప్రయాణించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రతి చిన్నారికి సురక్షితమైన, ఎలాంటి ఆటంకాలు లేని రవాణా సదుపాయాన్ని కల్పించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ కార్యక్రమమే నిదర్శనమని వారు స్పష్టం చేశారు.ఈ సరికొత్త చొరవ ద్వారా నైబర్‌హుడ్ కేంద్రాలకు, దివ్యాంగ చిన్నారుల ఇళ్లకు మధ్య ఉచిత రవాణా సదుపాయం లభిస్తుంది. రవాణా కష్టాల కారణంగా తమ పిల్లలను పునరావాస కేంద్రాలకు తీసుకురాలేని కుటుంబాలకు ఇంటి వద్దనే సురక్షితమైన, నమ్మకమైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. తద్వారా చిన్నారులు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు అవకాశం కలుగుతుంది. ఇది వారి పునరావాస సేవల్లో అంతరాయాన్ని తొలగించడమే కాకుండా, వారి సమగ్ర అభివృద్ధికి, మెరుగైన జీవన ప్రమాణాలకు ఎంతగానో దోహదపడుతుందని అధికారులు వెల్లడించారు.

# కేసీఆర్ విజన్ అద్భుతం..

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై మేఘాలయ సీఎం ప్రశంసలు: కేటీఆర్



హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) అద్భుతమైన నిర్మాణం పట్ల మేఘాలయ ముఖ్యమంత్రి సంగ్మా తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు.ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన మేఘాలయ సీఎం సంగ్మా.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పోలీసులతో ముచ్చటించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ భవన నిర్మాణ శైలిని చూసి ఇంత గొప్పగా ఎలా కట్టారని ఆయన ఆశ్చర్యపోయారని చెప్పారు. ఈ మేరకు సంగ్మా తనకు స్వయంగా ఫోన్ చేసి కేసీఆర్ విజన్, ఆయన ఆలోచనా విధానంపై ప్రశంసలు కురిపించారని వివరించారు.తమలాంటి యువ ముఖ్యమంత్రులు, నాయకులు కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సంగ్మా అన్నారని, తన తరఫున కేసీఆర్‌కు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేయాలని కోరినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. పోరాట యోధుడే పాలకుడైతే, రాష్ట్రాన్ని సాధించిన నాయకుడే స్వయంగా పరిపాలిస్తే అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో చెప్పడానికి ఇదే అత్యుత్తమ ఉదాహరణ అని కేటీఆర్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# తగ్గేదేలే.. హస్మత్‌పేట్‌లో హైడ్రా బుల్డోజర్ల గర్జన: అక్రమ నిర్మాణాల కూల్చివేత

హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలు, భూకబ్జాలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) మరోసారి ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు శనివారం ఉదయం నుంచే కఠిన చర్యలు చేపట్టారు. తగ్గేదేలే అనే రీతిలో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, మేడ్చల్ జిల్లా పరిధిలో భారీ కూల్చివేతలను నిర్వహించారు.అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్మత్పేట్ సర్వే నంబర్-1లో ఉన్న పురావస్తు శాఖకు చెందిన విలువైన భూమిని కొందరు కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో పూర్తి సమాచారంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, జేసీబీలతో సదరు అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు.ఈ కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేదా ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు ఘటనా స్థలంలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

# జల సంరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం

మర్రిగూడ జూన్ 27 (న్యూస్ వార్ )

జల శక్తి అభియాన్ ఆధ్వర్యంలో మర్రిగూడలోని పీఎం శ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులకు "నీటి సంరక్షణ -- విద్యార్థుల భాగస్వామ్యం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు మాట్లాడుతూ, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ ఎంతో అవసరమని వివరించారు. చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నీటిని వృథా కాకుండా కాపాడాలని సూచించారు. జల సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థి తన ఇంటి నుంచి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. తదనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం మాట్లాడుతూ, వాతావరణ సమతుల్యతకు వర్షాలు అవసరమని, వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. చెరువులు, కుంటలు నీటితో నిండాలంటే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శారద, ఏటీవో జయరాజ్, ఈసీ వివేక్, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహ, పాఠశాల ఉపాధ్యాయ బృందం



మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో 42 పెద్ద పులులు.. ముగిసిన పులుల గణన-2026

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతమైన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అఖిల భారత పులుల సెన్సెస్-2026 విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర వెల్లడించారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) మార్గదర్శకాల మేరకు అత్యంత పకడ్బందీగా ఈ లెక్కింపును నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 2025 నవంబర్ నుంచి 2026 జూన్ వరకు సుమారు ఎనిమిది నెలల పాటు ఈ పులుల గణన కార్యక్రమం నిరవధికంగా కొనసాగిందని పేర్కొన్నారు.తాజా సెన్సెస్ ప్రకారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో మొత్తం 42 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ గణనలో గుర్తించిన వాటిలో 18 ఆడ పులులు, 14 మగ పులులు, రెండు ఉప-వయోజన (సబ్-అడల్ట్) పులులతో పాటు ఎనిమిది పులి పిల్లలు ఉన్నట్లు అటవీశాఖ అధికారి వివరించారు. పులుల సంరక్షణకు తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యల వల్లే వాటి సంతతి వృద్ధి చెందుతోందని ఈ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతి:

## తెలంగాణ ప్రభుత్వానికి డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ధన్యవాదాలు

హైదరాబాద్ నగర ఖ్యాతి మరోసారి అంతర్జాతీయ వేదికపై మారుమోగింది. తెలంగాణ రాష్ట్రం, అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక వినూత్న నిర్ణయం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న అమెరికన్ కాన్సులేట్‌కు వెళ్లే ప్రధాన మార్గానికి తన పేరు పెట్టడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ, తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు తెలంగాణ ప్రభుత్వం డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ గా నామకరణం చేసింది. ఈ కార్యక్రమానికి అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై డొనాల్డ్ ట్రంప్ పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు ఉన్న గ్లోబల్ ఇమేజ్‌ను మరింత ఇనుమడింపజేయడానికే, అలాగే అమెరికాతో ఉన్న పారిశ్రామిక, సాంస్కృతిక బంధాలను దృఢపరచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఈ సందర్భంగా స్పష్టం చేసింది.ఈ అరుదైన పరిణామంపై డొనాల్డ్ ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన ట్రూత్ సోషల్ వేదికగా స్పందించారు. ఒక రహదారికి తన పేరు నామకరణం చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,